క్లుప్తంగా

గ్రామాల్లో అభివృద్ధి పనులకు నిధుల మంజూరు

కుక్కునూరు: మండలంలోని 12 సచివాల యాల పరిధిలో రూ.4.80 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరైనట్లు వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు కుచ్చర్లపాటి నరసింహరాజు తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కుక్కునూరు మండలంలో సీసీ రోడ్ల నిర్మాణానికి ఇంత భారీ స్థాయిలో నిధులు రావడానికి ఎమ్మెల్యే తెల్లం బాలరాజు కృషే కారణమని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలరాజుకు మండల ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం



దాతకు బాండ్‌ను అందిస్తున్న ఆలయ సూపరింటెండెంట్ రాజు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు గురువారం లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఏలూరుకు చెందిన గరికిపాటి శ్రీదేవి ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని నిత్యాన్నదాన కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ సూపరింటెండెంట్ రాజు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

ముగిసిన సర్టిఫికెట్ కోర్సు



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ విభాగం ఆధ్వర్యాన నిర్వహించిన 45 రోజుల సర్టిఫికెట్ కోర్స్ ముగిసింది. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ప్రసాద్‌బాబు మాట్లాడుతూ టాలీ విత్ జీఎస్టీ సర్టిఫికెట్ కోర్సు నిర్వహించినట్లు చెప్పారు. కొన్ని తరగతులను జంగారెడ్డిగూడెంకు చెందిన ఆడిటర్ జి.వీరేంద్ర కుమార్ వచ్చి స్వయంగా నిర్వహించారన్నారు. చార్టెడ్ అకౌంటెంట్ వీరేంద్ర మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులకు క్లాసులు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. టాలీ విత్ జీఎస్టీ సర్టిఫికెట్‌తో పాటు ఆ కోర్సుపై బాగా పట్టు ఉన్నట్లయితే ఉద్యోగాలను తొందరగా సాధించవచ్చు అన్నారు. కామర్స్ డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జ్ డాక్టర్ కె.ఉత్తమ సాగర్ మాట్లాడుతూ ప్రస్తుతం టాలీ విత్ జీఎస్టీ సాఫ్ట్‌వేర్‌కు డిమాండ్ ఉందని, అందువలన కళాశాలలో కామర్స్ విద్యార్థులకు ఈ సర్టిఫికెట్ కోర్స్ నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు సీహెచ్ రమాదేవి, కేవీవీ శిరీష, కామర్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళను మోసగించిన వ్యక్తిపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: మహిళను మోసగించిన గుర్తు తెలియని వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై వై.మంగయ్య తెలిపారు. జంగారెడ్డిగూడెం యూనియన్ బ్యాంక్‌లో మైసన్నగూడెనికి చెందిన పుట్టా సునీతకు అకౌంట్ ఉంది. జనవరి 25వ తేదీన ఏటీఎం ద్వారా నగదు తీసుకునేందుకు వెళ్లగా, చదువు రాకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తి సహాయం అడిగింది. సహాయం చేసినట్లుగా నటించిన సదరు వ్యక్తి సునీతకు చెందిన ఏటీఎం కార్డును మార్చి ఇచ్చాడు. అనంతరం అదే రోజు రాత్రి 7 గంటల నుంచి 26వ తేదీ ఉదయం 3 గంటల మధ్య రూ.70 వేలు విత్‌డ్రా చేశాడు. మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని సునీత భర్త సుధాకర్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

డీఎస్పీ బదిలీ

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం డీఎస్పీ ఎం.ధనుంజ యుడు బదిలీ అయ్యారు. ఆయన ను డీవోడబ్ల్యూ -2 (ఎకనామిక్ అఫెన్స్ వింగ్)కు బదిలీ చేస్తూ డీజీపీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. పల్నాడు జిల్లా దిశ డీఎస్పీగా పనిచేస్తున్న పి.రవిచంద్ర బదిలీపై ఇక్కడికి రానున్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

ఏలూరు టౌన్: వాహనదారులు విధిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఏలూరు రవాణా శాఖ అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జి.స్వామి అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఏలూరు నగరంలోని కొత్త బస్టాండ్ సమీపంలోని ఆటో స్టాండ్‌లో గురువారం ఆటో డ్రైవర్లకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ఆటోలు, కార్లు, మోటారు సైకిళ్లపై ప్రయాణించే వారు తప్పకుండా వాహన పత్రాలను, డ్రైవింగ్ లైసెన్సులను కలిగి ఉండాలన్నారు. వాహనాల ఫిట్‌నెస్‌ను నిత్యం పరీక్షించుకుంటూ ఉండాలని, వాహన రిజిస్ట్రేషన్, ట్యాక్స్‌లు సక్రమంగా ఉండేలా సరిచూసుకోవాలని సూచించారు. రోడ్డుపై వాహనానికీ వాహనానికీ మధ్య సుమారుగా 20 మీటర్ల దూరం ఉండేలా చూసుకోవాలన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పేదల అభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యం

కామవరపుకోట: రాష్ట్రంలో పేద ప్రజల అభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని వైఎస్సార్ సీపీ ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయకర్త కారుమూరి సునీల్ కుమార్, చింతలపూడి అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు అన్నారు. గురువారం మండలంలోని జలపవారిగూడెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కేసరి విజయభాస్కర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విజయరాజు మాట్లాడుతూ విజయభాస్కర్ రెడ్డి తనకు చిన్ననాటి స్నేహితుడని, ఈ ప్రాంత ప్రజలకు ఆయన సొంత నిధులతో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడంతో పాటు, ఈ ప్రాంత యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుందని అన్నారు. అనంతరం గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. మండలంలో రోడ్ల నిర్మాణంతో పాటు, మరమ్మతులు చేపట్టి త్వరితగతిన పూర్తి చేస్తామని, గత దశాబ్ద కాలంగా నిర్మాణానికి నోచుకోని కామవరపుకోట నుంచి అంకలంపాడు జలపవారిగూడెం మీదుగా కేఎస్ రామవరం, గుంటుపల్లి వరకు సుమారు 12 కిలోమీటర్లు రోడ్డు నిర్మాణం చేపట్టి త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో ప్రభుత్వ పథకాలు అందాలంటే ప్రజలు జన్మభూమి కమిటీల చుట్టూ తిరుగుతూ నానా ఇబ్బందులు ఎదుర్కొనే వారని, కానీ ఇప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు అందించి, వారి ఆర్థిక అభివృద్ధికి బలమైన పునాదులు వేశారన్నారు. పేదలు ఇంకా ఆర్థికంగా అభివృద్ధిని సాధించాలంటే సీఎం జగన్‌మోహన్‌రెడ్డినే మరలా అధికారంలోకి తీసుకురావాలని కోరారు. ఈనెల 3 తేదీన ఏలూరులో జరగబోయే సీఎం జగన్ బహిరంగ సభకు ప్రతి ఒక్కరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి, జెడ్పీటీసీ కడిమి రమేష్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మిడత రమేష్‌బాబు, చింతలపూడి ఏఎంసీ మాజీ చైర్మన్ మేడవరపు అశోక్ శ్రీనివాస్, మద్ది ఆంజనేయ స్వామి దేవస్థానం చైర్మన్ కేసరి సరిత రెడ్డి, నితిన్ రెడ్డి, సర్పంచ్‌లు చొక్క స్వర్ణ, కరిపోతు అనూష, ఎంపీటీసీ గోరిక క్రాంతి కుమార్, ఉప సర్పంచ్‌లు కేసరి శ్రీహరి రెడ్డి, మేడూరి రంగబాబు, నాయకులు గంగు ప్రసాద్ రెడ్డి, కృష్ణారెడ్డి, నరేందర్ రెడ్డి, కలపాల బాబురావు, నెక్కలపు వసంతరావు తదితరులు పాల్గొన్నారు.



వైఎస్ రాజశేఖరరెడ్డికి నివాళులర్పిస్తున్న కారుమూరి సునీల్ కుమార్, కంభం విజయరాజు తదితరులు

'సిద్ధం' సభను జయప్రదం చేయండి



గిరిబాబు గౌడ్

జంగారెడ్డిగూడెం: రానున్న ధర్మ యుద్ధానికి సమర నాదం పూరించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సిద్ధం బహిరంగ సభను జయప్రదం చేయాలని వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు పడమటి గిరిబాబు గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 3వ తేదీన దెందులూరు నియోజకవర్గంలోని సహారా గ్రౌండ్స్‌లో జగనన్న 'సిద్ధం' బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభలో రాబోయే ఎన్నికలకు సంబంధించి సీఎం జగన్ దిశానిర్దేశం చేస్తారన్నారు. ఏలూరు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల యువజన విభాగం సభ్యులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ధర్మయుద్ధంలో యువత చిత్తశుద్ధితో పనిచేసి జగనన్న ప్రభుత్వాన్ని సాధిద్దామని పిలుపునిచ్చారు.

బుట్టాయగూడెంలో 'సిద్ధం' ర్యాలీ

బుట్టాయగూడెం: త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికలకు వైఎస్సార్ సీపీ శ్రేణులను సిద్ధం చేయడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏలూరు జిల్లా దెందులూరులో 'సిద్ధం' పేరుతో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ గురువారం సాయంత్రం బుట్టాయగూడెంలో ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తెల్లం రాజ్యలక్ష్మి ఆధ్వర్యాన నాయకులు, కార్యకర్తలు ద్విచక్ర వాహనాలతో ర్యాలీలో పాల్గొన్నారు. స్థానిక శివాలయం నుంచి రాజ్యలక్ష్మి పార్టీ జెండాను ఊపి ర్యాలీని ప్రారంభించారు. నెహ్రూ సెంటర్ మీదుగా కృష్ణాపురం వరకు ఎంతో ఉత్సాహంగా ర్యాలీ సాగింది. రాజ్యలక్ష్మి కూడా నృత్యాలు చేస్తూ కార్యకర్తలను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఎన్నికల యుద్ధంలో మనందరం ధర్మం వైపు పోరాటం చేసి రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేసి మరోసారి జగనన్నను సీఎం చేద్దామని పిలుపునిచ్చారు. జగనన్నను సీఎం చేసేందుకు నేను సిద్ధంగా ఉన్నాను మీరు సిద్ధమా అని అడిగారు. అలాగే కృష్ణాపురంలోని పలు గృహాలను సందర్శించి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, ఎంపీ అభ్యర్థిగా కారుమూరి సునీల్‌కుమార్‌కు ఓటు వేసి గెలిపించాలని ప్రచారం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మొడియం రామతులసి, పార్టీ నాయకులు ఆరేటి సత్యనారాయణ, సయ్యద్ బాజీ, సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ, ఎంపీటీసీ తెల్లం రమణ, జీసీసీ స్టేట్ డైరెక్టర్ తెల్లం చిన్నారావు, కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ బాజీ, రేపాకుల చంద్రం, చింతపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ పోలవరం నియోజకవర్గ కన్వీనర్ తెల్లం రాజ్యలక్ష్మి

బహిరంగ సభకు భారీగా తరలి రండి

చింతలపూడి: ఈనెల 3న దెందులూరులో జరిగే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'సిద్ధం' బహిరంగ సభకు నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి రావాలని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు పిలుపునిచ్చారు. సిద్ధం సభ సన్నాహక కార్యక్రమంలో భాగంగా గురువారం చింతలపూడిలో సుడిగాలి పర్యటన చేశారు. సీనియర్ నాయకులు బొడ్డు వెంకటేశ్వరరావు ఇంటి వద్ద, ఏఎంసీ కార్యాలయం వద్ద, సుప్రింపేటలో వేర్వేరుగా జరిగిన కార్యకర్తల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. రాష్ట్రానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అవ్వడం ఖాయమని అన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు ఆహ్వానిస్తున్నారని చెప్పారు. ముఖ్యంగా విద్య, వైద్య రంగాల అభివృద్ధే ఇందుకు నిదర్శనమన్నారు. వచ్చే ఎన్నికల్లో చింతలపూడి నియోజకవర్గాన్ని అత్యధిక మెజార్టీతో గెలిపించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇవ్వాలని పిలుపునిచ్చారు. అనంతరం ఏఎంసీ కార్యాలయంలో సిద్ధం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి, ఎంపీపీ డాక్టర్ బి.రాంబాబు నాయక్, జెడ్పీటీసీ ఎం.నీరజా సుధాకర్, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ కొప్పుల నాగేశ్వరరావు, రాష్ట్ర యువత ప్రధాన కార్యదర్శి కె.దినేష్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ బొడ్డు వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ జిల్లా సభ్యులు గంధం చంటి, జి.రాజేష్ నాయుడు, పార్టీ బీసీసెల్ జిల్లా కార్యదర్శి బి.చెంచమరాజు, గిరి భోగారావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎం.ఇమ్మానియేలు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు ఎస్.కాంతారావు, సొసైటీ మాజీ చైర్మన్ ఆతుకూరి సుబ్బారావు, ఎస్టీ నాయకులు రామరాజు నాయక్, తాటిపర్తి రాజు, ఎస్.రమేష్ రెడ్డి, జి.చంద్రశేఖర్‌రెడ్డి, ఎం.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ విజయరాజు

ఎన్నికల నిర్వహణకు సిద్ధం



మాట్లాడుతున్న ఆర్డీఓ అద్దయ్య

బుట్టాయగూడెం: రానున్న సార్వత్రిక ఎన్నికలు విజయవంతంగా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు జంగారెడ్డిగూడెం ఆర్డీఓ అద్దయ్య తెలిపారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో ఓటర్ల జాబితాలపై సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోలవరం నియోజకవర్గంలో 2,52,627 మంది ఓటర్లు ఉన్నారన్నారు. వీరిలో పురుషులు 1,22,209 మంది, 1,30,408 స్త్రీలు, ఇతరులు 10 ఉన్నారని, ఓటర్ లిస్ట్‌లు ప్రతి పోలింగ్ బూత్ వద్ద, గ్రామ సచివాలయాల్లో అందుబాటులో ఉంచామని చెప్పారు. ఓటరు లిస్ట్ తుది జాబితా విడుదలైన తర్వాత లిస్ట్‌లో చిన్నచిన్న సమస్యలను గుర్తించామని తెలిపారు. మొత్తం 1,011 క్లెయిమ్స్ ఉన్నాయని వాటిని సరిచేస్తున్నామని చెప్పారు. అయితే ఈ ప్రక్రియ పోలింగ్ జరిగే నాటి వరకూ కొనసాగుతుందని చెప్పారు. పోలవరం నియోజకవర్గంలో ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. సమస్యాత్మక గ్రామాలపై దృష్టి పెట్టామని చెప్పారు. పోలీసుల సహకారంతో ఎన్నికలు సజావుగా జరిగేలా కృషి చేస్తామని తెలిపారు. ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని ఆయన కోరారు. సమావేశంలో తహసీల్దార్‌లు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

ప్రజాసేవకు అంకితమైన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

కొయ్యలగూడెం: నవరత్న పథకాలతో నిరంతరం ప్రజాసేవకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అంకితమై ఉందని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. గురువారం సరిపల్లి పంచాయతీ గిరిజన గ్రామమైన వంకా బొత్తప్పగూడెం వాసులకు ఆయన తన ఇంటి వద్ద భూ పట్టాలను పంపిణీ చేశారు. గ్రామస్తులు వంకా సీత మరియ, గిరిజనులైన మరో ముగ్గురికి వీటిని పీఏసీఎస్ అధ్యక్షురాలు మండపాటి శ్రీదేవి, గ్రామ కమిటీ కన్వీనర్ ఎం.రామకృష్ణతో కలిసి అందజేశారు. ఆరు నెలల క్రితం జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భూమిలేని నిరుపేదలకు పట్టాలు ఇప్పించాల్సిందిగా స్పందనలో తెలియజేశారని రామకృష్ణ తెలిపారు. దీనిపై తహసీల్దార్ పి.నాగమణి సరిపల్లి గ్రామంలో అసైన్డ్ భూమి సర్వేచేసి వివరాలు అందజేయాల్సిందిగా వీఆర్‌ఓ అడపా రాంబాబుకు ఆదేశాలు జారీ చేశారన్నారు. క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయగా సరిపల్లి గ్రామంలో సర్వే నంబర్ 199 మిగిలిన రెండు ఎకరాల భూమిని గుర్తించామన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇచ్చిన హామీ మేరకు అర్హులైన నాలుగు కుటుంబాలకు పట్టాలు అందజేసినట్లు వీఆర్‌ఓ అడపా రాంబాబు తెలిపారు.



కొత్తగూడెం గిరిజనులకు భూ పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

20 నుంచి నరసింహుని కల్యాణోత్సవాలు

ద్వారకాతిరుమల: శ్రీవారి దేవస్థానం దత్తత ఆలయమైన మండలంలోని ఐఎస్ జగన్నాథపురంలో సుందరగిరిపై కొలువైన స్వయం భూ శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాలు ఈనెల 20 నుంచి 25వ తేదీ వరకు వైభవంగా జరుగనున్నాయి. అందుకు భారీగా ఏర్పాట్లు చేయనున్నట్టు ఆలయ ఈఓ వేంద్ర త్రినాథరావు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 20న ఉదయం స్వామి, అమ్మవార్లను పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తెలుగా ముస్తాబు చేస్తారు. 22న ఉదయం కొండ కింద కల్యాణ మండపంలో స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహిస్తారు. 23న సాయంత్రం గ్రామోత్సవం, 24న పంచామృతాభిషేకాలు, చందనోత్సవం, పూర్ణాహుతి వేడుకలు జరుగుతాయి. 25న జరగనున్న ద్వాదశ కోవెల ప్రదక్షిణలు, శ్రీ పుష్ప యాగోత్సవంతో ఉత్సవాలు పరిసమాప్తం అవుతాయని ఈఓ తెలిపారు. ఈ వేడుకల్లో భక్తులు భారీగా పాల్గొనాలని ఆయన కోరారు.



లక్ష్మీనరసింహ స్వామివారు

విజయవాడ వెళ్లి పింఛన్ అందజేత



చింతలపూడి: విజయవాడలో చికిత్స పొందుతున్న వృద్ధురాలికి పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ వెంకన్నబాబు



జంగారెడ్డిగూడెం రూరల్: లక్కవరంలో పెన్షన్ పంపిణీ చేస్తున్న వలంటీర్



కుక్కునూరు: వృద్ధురాలికి పెన్షన్ అందజేస్తున్న వలంటీరు, గృహసారథులు

చింతలపూడి: చింతలపూడి మండలం వెంకటాపురం పంచాయతీ పింగులగూడెం సచివాలయ వలంటీర్ పాకనాటి వెంకన్నబాబు తన సొంత ఖర్చులతో విజయవాడలోని వైవీ రావు గుండె, ఊపిరితిత్తుల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బొక్కా లక్ష్మి అనే వృద్ధురాలికి గురువారం పెన్షన్ అందజేశాడు. పెన్షన్‌పైనే ఆధారపడి బతుకుతున్న వృద్ధురాలికి పింఛన్ అందజేసినందుకు గ్రామస్తులు, అధికారులు వలంటీర్‌ను అభినందించారు,

జంగారెడ్డిగూడెం మండలంలో..

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండలంలో గురువారం పెన్షన్లు పంపిణీ చేశారు. తెల్లవారు జాము నుంచే వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పెన్షన్ నగదు సొమ్మును అందజేశారు. లక్కవరంలో సచివాలయం కన్వీనర్ మల్లెల్లి సూర్యనారాయణ చేతుల మీదుగా పెన్షన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్లు పంపిణీ చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

కుక్కునూరు మండలంలో..

కుక్కునూరు: మండల వ్యాప్తంగా గురువారం పెన్షన్‌లను పంపిణీ చేశారు. పాత పెన్షన్‌లతో పాటు కొత్త మంజూరైన పెన్షన్‌లను కూడా వలంటీర్లు లబ్ధిదారులకు అందజేశారు. కాగా, గత ప్రభుత్వ హయాంలో పెన్షన్‌ల కోసం పంచాయతీ కార్యాలయాల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చేదని, అలాంటి బాధ లేకుండా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ల ద్వారా ఇంటికే పెన్షన్‌లు పంపించడం సంతోషంగా ఉందని వృద్ధులు ఆనందం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో మరలా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షించారు.

జంగారెడ్డిగూడెం మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం



కమిషనర్ పి.భవానీ ప్రసాద్‌ను సత్కరిస్తున్న మున్సిపల్ కార్మికులు

జంగారెడ్డిగూడెం: రిపబ్లిక్ డే సందర్భంగా ఉత్తమ సేవలకు గానూ జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్న మున్సిపల్ కమిషనర్ పి.భవానీ ప్రసాద్‌ను గురువారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఏలూరు జిల్లా అధ్యక్షుడు కె.విఘ్నేష్, ఇంజినీరింగ్ విభాగం అధ్యక్ష, కార్యదర్శులు కంతేటి వెంకటరావు, సుబ్రహ్మణ్యం, అయినాల ముత్యాలరావు, ఉపాధ్యక్షులు దోసూరి నాగరాజు, బాల సుబ్రహ్మణ్యం, అప్పలస్వామి, దిర్సిపాము అనిల్, పారిశుధ్య విభాగం అధ్యక్ష, కార్యదర్శులు కొత్తూరి నాగేశ్వరావు, బొక్క శ్రీను, రేలంగి నాగరాజు, కొత్తూరి శ్రీను, సోమయదుల వీర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానం ఆధ్వర్యాన టోల్‌గేట్ నిర్వహణ



శ్రీవారి కొండపైన ఉన్న టోల్‌గేట్

ద్వారకాతిరుమల: శ్రీవారి కొండపైన టోల్‌గేట్ నిర్వహణను దేవస్థానం గురువారం చేపట్టింది. నష్టం వస్తుందంటూ కాంట్రాక్టర్ టోల్ నిర్వహణను విడిచిపెట్టడంతో దేవస్థానమే సొంతంగా టోల్ రుసుములను వసూలు చేస్తోంది. వివరాల్లోకి వెళితే.. స్థానిక దేవస్థానం టోల్‌గేట్ నిర్వహణకు 2023 జనవరి 18న ఆలయ అధికారులు రెండేళ్ల కాలపరిమితికి బహిరంగ వేలం పాటను నిర్వహించారు. భీమడోలు మండలం పూళ్లకు చెందిన కందులపాటి శ్రీనివాసరావు ఏడాదికి రూ.1,70,10,000లకు హెచ్చు పాటదారుడిగా నిలిచారు. డిపాజిట్ సొమ్ము రూ.10 లక్షలతో పాటు, మొదటి సంవత్సరం సొమ్ము రూ. 1,70,10,000లు, అదనంగా 18 శాతం జీఎస్టీని చెల్లించి గతనెల 31 వరకు టోల్‌గేట్‌ను నిర్వహించారు. అయితే రెండో ఏడాదికి సంబంధించిన సొమ్మును చెల్లించాలని దేవస్థానం అధికారులు కాంట్రాక్టరుకు ఇప్పటికే మూడు సార్లు నోటీసులను జారీ చేశారు. దీనికి సదరు కాంట్రాక్టర్ టోల్ టికెట్టుపై 18 శాతం జీఎస్టీని భక్తుల నుంచి వసూలు చేసే వీలు లేకపోవడంతో తాను ఎక్కువ నష్టపోయానని, రెండో ఏడాది టోల్‌గేట్‌ను నిర్వహించలేనని, తాను వేలంపాట సమయంలో కట్టిన రూ.10 లక్షల డిపాజిట్ సొమ్మును తిరిగి వెనక్కి ఇవ్వాలని దేవస్థానం అధికారులకు అర్జీ పెట్టుకున్నాడు. దీనిపై అధికారులు ఏ విధంగా స్పందిస్తారన్నది వేచి చూడాల్సి ఉంది. ఇదిలా ఉంటే దేవస్థానం సిబ్బంది గురువారం ఉదయం సుమారు 10 గంటల నుంచి కొండపైకి వచ్చే భక్తుల వాహనాలకు టోల్ రుసుములను వసూలు చేశారు.

నేటి నుంచి రివిజన్ టెస్ట్ పరీక్షలు

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విజయకేతనం రివిజన్ టెస్ట్-1 పరీక్షలను ఈనెల 2వ తేదీ నుంచి నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని డీఈఓ పి.శ్యామ్‌సుందర్ సూచించారు.